క్లుప్తంగా

సర్వే పారదర్శకంగా చేపట్టాలి

ఇచ్చోడ: ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే పారదర్శకంగా చేపట్టాలని జెడ్పీ సీఈవో జితేందర్ రెడ్డి అన్నారు. సోమవారం అడేగామ(బి)లో నిర్వహించిన సర్వే వివరాలను పరిశీలించారు. ప్రభుత్వం ఫ్యామిలీ డిజిటల్ సర్వే కార్డుల సర్వే మండలాలని ఒక్కటి చొప్పున పైలెట్ ప్రాజెక్టు కింద నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పైలెట్ ప్రాజెక్టు సర్వే పూర్తయిన తరువాత మండల వ్యాప్తంగా నిర్వహిస్తామన్నారు. సర్వే ద్వారా ప్రతీ కుటుంబం వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఆయన వెంట ఎంపీడీవో లక్ష్మణ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయంలో సీఎం ఫొటో ఏర్పాటు

నేరడిగొండ: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటాన్ని మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రాజ్‌వీర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఆదేశాల మేరకు కార్యాలయంలో ముఖ్యమంత్రి ఫొటో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంపీవో లక్ష్మణ్, పశువైద్యాధికారి సుశీల్ కుమార్, ఎంపీడీవో కార్యాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బలరాం జాదవ్‌కు సన్మానం

నేరడిగొండ: తెలంగాణ రాష్ట్ర లెక్చరర్ల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్‌ను పెద్ద బుగ్గారం గ్రామానికి చెందిన యువకులు సన్మానించారు. ఇటీవల ఆయన మరోమారు తెలంగాణ రాష్ట్ర లెక్చరర్ల సంఘం ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా శాలువాతో సత్కరించారు.

ఆర్థిక సాయం

ఆదిలాబాద్‌టౌన్: తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘ భవనంలో ఆఫీస్ బాయ్‌గా పనిచేస్తూ ఇటీవల మృతి చెందిన నవీన్ కుటుంబానికి ఉద్యోగులు ఆర్థిక సాయం అందజేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీఓస్ సంఘ భవనంలో మృతుడి తండ్రి లింగన్నకు జేఏసీ చైర్మన్ అశోక్ రూ.70 వేల చెక్కు అందజేశారు. కార్యక్రమంలో టీఎన్‌జీవోస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్ కుమార్, టీజీవో సంఘం సహాయ అధ్యక్షుడు శివకుమార్, రాజేందర్ దేశ్‌పాండే, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

తాంసి: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని గోపాలకృష్ణ మఠాధిపతి యోగానంద సరస్వతి అన్నారు. ఆదివారం రాత్రి భీంపూర్ మండలంలోని అర్లి(టి) గ్రామంలో దుర్గామాత మండపం వద్ద సామూహిక కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరై దుర్గామాత వద్ద పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలచే కుంకుమార్చన చేయించారు. కార్యక్రమంలో గ్రామ వీడీసీ అధ్యక్షుడు నవీన్, బొంత నితిన్, రాకేశ్, లస్మన్న, గంగయ్య పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన

సిరికొండ: మండలంలోని పోచంపల్లి అడవిలో సిరిచెల్మ రేంజ్ అటవీ శాఖ అధికారులు పోచంపల్లి పాఠశాల విద్యార్థులకు వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కల్పించారు. సిరికొండ అటవీశాఖ అధికారి కాలేందర్, పోచంపల్లి అటవీ శాఖ అధికారి హీరాలాల్ విద్యార్థులకు వన్యప్రాణుల ద్వారా కలిగే లాభాల గురించి, శిక్షల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అటవీశాఖ సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణంపై ఫిర్యాదు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలో గల మావల మండల కేంద్రంలోని చెరువులో అక్రమంగా నిర్మించిన భవనంపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్, కౌన్సిలర్ జహీర్ రంజానీ కోరారు. సోమవారం జిల్లా కలెక్టర్ రాజర్షి షాను కలిసి వినతిపత్రం అందజేశారు. బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్ కాకుండా ఏకంగా చెరువులోనే గెస్ట్‌హౌస్ నిర్మించారన్నారు. వర్షాకాలంలో చెరువునీరంతా అందులోకి చేరుతుందన్నారు. చెరువును కబ్జా చేసి, భవనం కట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడులు సరికాదు

ఎదులాపురం: పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడులు సరికాదని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి అన్నారు. పాలస్తీనా దేశస్థులకు సంఘీభావం తెలుపుతూ జిల్లా కేంద్రంలో సోమవారం వామపక్షాల ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడులను ప్రారంభించి సంవత్సరం గడుస్తోందన్నారు. ఇజ్రాయెల్ యుద్ధ నీతిని మరిచి అమాయకులైన ప్రజలపై బాంబులు వేయడం ఆందోళన కలిగించే అంశమన్నారు. అంతర్జాతీయ న్యాయస్థానం, ఐక్యరాజ్యసమితి దాడులను ఆపాలని డిమాండ్ చేశారు. నాయకులు దర్శనాల మల్లేశ్, జగన్, కుంటాల రాములు, వెంకట్ నారాయణ, అరుణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్తుల సహకారం.. లైబ్రరీ నిర్మాణం


పంచాయతీ భవనంపై నిర్మించిన గ్రంథాలయం

- కప్పర్లలో యువత కోసం ప్రత్యేకంగా గ్రంథాలయం
- రూ.10 లక్షలు వెచ్చించిన స్థానికులు

తాంసి: గ్రామీణ ప్రాంత విద్యార్థులో నైపుణ్యం ఉన్న వారికి సరైన పోత్సాహం లేక రాణించలేక పోతున్నారు. విద్యార్థులు, యువతకు అవసరమైన సదుపాయాలు కల్పిస్తే చెడు అలవాట్లకు దూరంగా ఉండి లక్ష్యం చేరుకునే అవకాశం ఉంటుంది. ఈ విధంగా గ్రామస్తులు ఆలోచించి, మండలంలోని కప్పర్ల గ్రామంలో పాఠశాలను గ్రామాభివృద్ధి కమిటీ సహకారంతో అన్ని సదుపాయాలు కల్పించి మెరుగైన విద్య అందేలా చూస్తున్నారు. దీంతో పాటు గ్రామస్తుల్లో భక్తిభావం పెంపొందించేందుకు గతేడాది గ్రామాభివృద్ధి కమిటీ సహకారంతో పాటు దేవాదాయశాఖ నిధులతో రూ.2 కోట్లతో రామాయలం నిర్మించారు. అలాగే చదువుతో పాటు ప్రభుత్వ ఉద్యోగాలకు సన్నద్ధం అయ్యేందుకు గ్రామస్తులు తలకొంత డబ్బులను పోగు చేసి గ్రంథాలయ భవన నిర్మాణం చేపట్టారు. గ్రంథాలయంలో


అందుబాటులో ఉన్న పుస్తకాలు

విద్యార్థులు, యువత చదువుకునేందుకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉంచారు. దీంతో యువత పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు.

రూ.10 లక్షలతో గ్రంథాలయం..

యువత చదువుల కోసం గ్రామస్తుల ఆర్థిక సాయంతో రూ.10 లక్షల వరకు వెచ్చించి గ్రంథాలయం ఏర్పాటు చేశారు. సొంత భవనం నిర్మాణానికి స్థలం లేక గ్రామపంచాయతీ కార్యాలయం భవనంపై గదులతో పాటు షెడ్డు నిర్మించారు. రీడింగ్ రూమ్‌లో ప్రతిఒకరు చదువుకునే విధంగా ప్రత్యేక టేబుళ్లు ఏర్పాటు చేశారు. ప్రత్యేక గదితో పాటు అరలను సిద్ధం చేశారు. అన్ని వసతులు కల్పించారు. బోథ్ ఎమ్మెల్యే తనవంతుగా లైబ్రరీలో పుస్తకాల కోసం రూ.20 వేల నగదును గ్రామస్తులకు విరాళంగా అందించారు.

డీఎస్సీలో కొలువు సాధించా



గ్రామంలో ఏర్పాటు చేసిన లైబ్రరీలో ప్రతీ రోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు చదువుకున్నా. గత ఆరు నెలలుగా డీఎస్సీ పరీక్ష కోసం లైబ్రరీలో తోటి యువతతో కలిసి పక్కాగా ప్రణాళికతో చదివినా. గ్రామస్తులు లైబ్రరీ నిర్మించడం మాలాంటి వారికి ఎంతో ఉపయోగకరంగా మారింది. వారం రోజుల క్రితం వెలువడిన డీఎస్సీ ఫలితాల్లో ఎస్జీటీగా ఉద్యోగం సాధించాను.

– కె.గంగసాగర్, కప్పర్ల

గ్రామంలో గ్రంథాలయం నిర్మించాం



గ్రామంలోని యువత చదువుల కోసం నా వంతుగా రూ.2 లక్షలు విరాళంగా అందించా. యువతతో పాటు విద్యార్థులు ఉద్యోగాల సాధన కోసం ఆదిలాబాద్, హైదరాబాద్ వెళ్లి రూ.లక్షల్లో ఖర్చు చేస్తున్నారు. గ్రామంలోనే లైబ్రరీ నిర్మించి వసతులు కల్పిస్తే ఉద్యోగాల కోసం చదివే విద్యార్థులకు మేలు జరిగే అవకాశం ఉందని గ్రంథాలయం నిర్మించాం.

– కౌడాల సంతోశ్, మాజీ ఎంపీటీసీ, కప్పర్ల

మెరుగైన వైద్యం అందించాలి

- ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్: ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని నిరుపేదలు వైద్యానికి సంబంధించి అత్యవసర సమయాల్లో ఆర్థిక భారంతో కుంగిపోతున్నారన్నారు. ఆస్పత్రుల్లో లక్షల బిల్లులు చెల్లిస్తూ అప్పుల పాలవుతున్నారని తెలిపారు. పేదలకు వైద్యం ఖరీదుగా మారిపోయిందన్నారు. ఆరోగ్యశ్రీ పథకం పరిమితిని రూ. 5 లక్షల నుంచి పది లక్షలకు పెంచుతున్నట్లు ప్రభుత్వం ప్రకటించినప్పటికీ క్షేత్రస్థాయిలో ఎక్కడ అమలు కావడం లేదున్నారు. దీంతో ప్రజలు అవస్థలు పడాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వం నిరుపేదల వైద్యానికి అయ్యే ఖర్చును పూర్తిగా భరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు లాలా మున్నా, ఉష్కం రఘుపతి, ఆకుల ప్రవీణ్, కృష్ణ యాదవ్, భీమ్సేన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే

మార్కెట్‌లోనే పంటలు విక్రయించాలి

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

తాంసి: రైతులు పండించిన పంటను దళారులకు అమ్మి మోసపోవద్దని, మార్కెట్‌యార్డులో విక్రయించి మద్దతు ధర పొందాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని సబ్ మార్కెట్‌యార్డులో సోయా కొనుగోలు కేంద్రాన్ని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డితో కలిసి ప్రారంభించారు. పంటను విక్రయించేందుకు వచ్చిన రైతును శాలువాతో సత్కరించారు. పంటను దళారులకు విక్రయించి నష్టపోవద్దన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో 26 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. గ్రామంలోని దుర్గామాత, శారదాదేవి విగ్రహాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. పొన్నారిలో ఏర్పాటు చేసిన స్టీల్ బ్యాంకును సైతం ప్రారంభించారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డీఎం ప్రవీణ్ రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ ధనుంజయ్, ఏవో రవీందర్, మండల ప్రత్యేకాధికారి వెంకట రమణ, ఎంపీడీవో మోహన్ రెడ్డి, తహసీల్దార్ లక్ష్మి, సొసైటీ సీఈవో కేశవ్, సంతోశ్, మహేందర్, రఘు, రామన్న, రమేశ్, రమణ పాల్గొన్నారు.


సోయా కొనుగోళ్లు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

రోడ్డు పనులు ప్రారంభించాం

తాంసి: దశాబ్దులుగా ప్రధాన సమస్యగా ఉన్న కరంజి(టి) అంతరాష్ట్ర రోడ్డు నిర్మాణం చేస్తామని ఎన్నికల్లో మాట ఇచ్చామని, ఇచ్చిన మాట ప్రకారం ప్రస్తుతం రోడ్డు పనులు కొనసాగుతున్నాయని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. సోమవారం భీంపూర్ మండల కేంద్రంలోని కేజీబీవీలో పాఠశాలలో రూ.2.30 కోట్లతో నిర్మించే అదనపు గదుల నిర్మాణానికి భూమిపూజ చేశారు. మండలంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో గోపాలకృష్ణ రెడ్డి, డీఈ శంకర్, ఏఈ సుమంత్, మాజీ జెడ్పీటీసీ కుమ్ర సుధాకర్, నాగయ్య, గంగయ్య, నితిన్, సంజీవ్ రెడ్డి, లింబాజీ, కల్చప్ యాదవ్ పాల్గొన్నారు.

బస్టాండ్ ప్రారంభానికి ఏర్పాట్లు

- మరమ్మతుల కోసం రూ.5లక్షల మంజూరు

సాక్షి ఎఫెక్ట్..

ఇచ్చోడ: నిరుపయోగంగా మారిన మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌ను బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ సోమవారం పరిశీలించారు. 7న సాక్షిలో నిరుపయోగంగా బస్టాండ్ అనే కథనం ప్రచురితమవడంతో ఎమ్మెల్యే స్పందించారు. వసతుల కల్పన, మరమ్మతుల కోసం ఎమ్మెల్యే నిధుల నుంచి రూ. 5 లక్షలు మంజూరు చేశారు. ఆర్టీసీ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. నాలుగైదు రోజుల్లో మరమ్మతులు చేపట్టాలలన్నారు. మూత్రశాలలు, మరుగుదొడ్ల మరమ్మతులు యుద్ధ ప్రతిపాదికన పనులు పూర్తి చేసి, దసరా రోజు బస్టాండ్‌ను పున: ప్రారంభించడానికి ఏర్పాట్లు చేయాలన్నారు. ఆర్టీసీ డీఎం సేఫ్టి డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్ యూసుఫ్, బస్టాండ్‌ను పరిశీలించి, రోడ్డు ఇంజనీరింగ్ సూపర్‌వైజర్లతో మాట్లాడారు.


బస్టాండ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

హమాలీలుగా స్థానికులను తీసుకోవాలి

తాంసి: ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న పంటల కొనుగోలు కేంద్రాల్లో స్థానిక కూలీలను హమాలీలుగా తీసుకోవాలని స్థానిక కూలీలు డిమాండ్ చేశారు. తాంసి సోయా క్రాంతికర్ హమాలీ లేబర్ కాంట్రాక్ట్ కోఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం కొనుగోలు కేంద్రం ప్రారంభానికి విచ్చేసిన ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌కు, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. బీహార్ కూలీలతో పనులు చేయించడం ద్వారా స్థానికంగా తమ ఉపాధి దూరం అవుతుందన్నారు. హమాలీలుగా స్థానికులకు పని కల్పించి న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో మజ్దూర్ యూనియన్ జిల్లా నాయకుడు సంతోశ్ కుమార్, హమాలీ కూలీలు రాజు, సంతోశ్, శాలిక్‌రావు పాల్గొన్నారు.


ఆందోళన చేస్తున్న స్థానిక కూలీలు

నీటి సరఫరా సహాయకులకు శిక్షణ పూర్తి

సిరికొండ: గత నాలుగు రోజులుగా గ్రామ నీటి సహాయకులకు మంచినీటి సరఫరా, పైపుల లీకేజీలు, విద్యుత్ మోటార్ల మరమ్మతులపై శిక్షణ నిర్వహించారు. సోమవారం శిక్షణ పూర్తయింది. మిషన్ భగీరథ ఎస్ఈ సురేశ్, ఈఈ చంద్రమోహన్, ఏఈఈ జైపాల్ శిక్షణను పరిశీలించారు. నీటి సరాఫరాలో ఇబ్బంది రాకుండా చూడాలన్నారు. లీకేజీలు, మోటార్ మరమ్మతులు వెంటనే పరిష్కరించాలన్నారు. అనంతరం శిక్షణ పొందిన సహాయకులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రవీందర్, ఎంపీవో సంతోష్ కుమార్, కార్మికులు పాల్గొన్నారు.


సర్టిఫికెట్లు అందుకుంటున్న గ్రామ నీటి సహాయకులు

ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు


పూజలో పాల్గొన్న భక్తులు


పొచ్చెరలో బోనాలతో మహిళలు

బోథ్: మండలంలోని పొచ్చెర గ్రామంలో శరన్నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. బ్రహ్మంగారి ఆలయ ప్రాంగణంలో కొలువుదీరిన దుర్గాదేవికి భక్తులు సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ఐదో రోజు పంచలోహ దుర్గాదేవి ఉత్సవమూర్తి విగ్రహాన్ని పల్లకిలో పురవీధుల గుండా ఊరేగించారు. మహిళలు దేవికి బోనాల సమర్పించారు.

- బోథ్ మండల కేంద్రంలో కొలువుదీరిన దుర్గామాతకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. సోమవారం పండితులు సదానంద శర్మ, రమేశ్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. మహిళా భక్తులు కుంకుమార్చన పాల్గొన్నారు. అమ్మవారి అనుగ్రహం ప్రజలపై ఉండాలని, ప్రజలు సుఖశాంతులతో ఉండాలని కోరుకున్నారు.

వైభవంగా కుంకుమార్చన


కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

బేల: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని టీచర్స్ కాలనీలోని ఏక్తా దుర్గా ఉత్సవ మండలి ఆధ్వర్యంలో సోమవారం సామూహిక కుంకుమార్చన వైభవంగా నిర్వహించారు. దుర్గాదేవికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మహిళ భక్తులు నిపుంగే చంద్రసేన, స్వప్న, భాగలక్ష్మి, రాక్రే గీత, ప్రియ పాల్గొన్నారు.

మంత్రి సీతక్కను కలిసిన 'కంది'

కైలాస్‌నగర్: రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ధనసరి సీతక్కను కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. సోమవారం హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో ఆమెతో భేటీ అయి శాలువాతో సత్కరించారు. నియోజకవర్గ రాజకీయ పరిస్థితులపై చర్చించారు.

ఘనంగా దుర్గామాత శోభాయాత్ర

నేరడిగొండ: దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం మండలంలోని వడూర్, కుమారి, కుప్టి, తేజాపూర్ గ్రామంలో దుర్గామాత పల్లకి శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రతిష్ఠించిన దుర్గామాతా మండపాల వద్ద నుంచి శోభాయాత్ర చేపట్టారు. దుర్గామాతా భక్తి గీతాలను ఆలపించారు. దీంతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

పేదల ఆకలి తీర్చడమే బొజ్జన్న బువ్వ లక్ష్యం

ఉట్నూర్‌రూరల్: పేదల ఆకలిని తీర్చడమే లక్ష్యంగా ప్రతీ సోమవారం బొజ్జన్న బువ్వ కార్యక్రమం చేపడుతున్నట్లు నాయకులు అన్నారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయ ఆవరణలో బొజ్జన్న బువ్వ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులకు భోజనం అందించారు. కార్యక్రమంలో జైవంత్‌రావు, మెస్రం నగేశ్, మోబీన్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు సిద్ధం కావాలి

ఉట్నూర్‌రూరల్: ఎమ్మెల్సీ ఎన్నికలకు సిద్ధం కావాలని బీజేపీ జాతీయ కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి పాలసాని సుగుణాకర్‌రావు అన్నారు. సోమవారం ఉట్నూర్ మండలంలో నాయకులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల కార్యాచరణతో పాటు పట్టభద్రులతో చర్చించారు. సమావేశంలో నాయకులు శ్రీరాంనాయక్, కొండేరి రమేశ్, వెంకటేశ్, జగ్జీవన్, ధన్‌లాల్, బాలాజీ, బొడ్డు కిరణ్, జగన్, సతీశ్, రాంచందర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉపాధ్యాయుడి ఔదార్యం

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని రాంనగర్‌కు చెందిన మెట్‌పెల్లి రాజు అనే కారు మెకానిక్ పక్షవాతానికి గురయ్యాడు. ఆయన తండ్రి చనిపోగా తల్లి కూలీ పని చేస్తోంది. ఇద్దరు చిన్న పిల్లలున్నారు. కుటుంబ భారమంతా మోసే రాజు అనారోగ్యానికి గురై మంచానికే పరిమితమయ్యాడు. దీంతో వారి కుటుంబ పరిస్థితిని చూసి చలించిన ఆదివాసీ సంఘ నాయకుడు, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యదర్శి కనక అభిమాన్ తన ఔదార్యాన్ని చాటుకున్నారు. సోమవారం బాధితుడి ఇంటికి వెళ్లి రూ.22 వేలు అందజేశాడు.

పదోన్నతి పొందిన అధికారికి సన్మానం

ఆదిలాబాద్‌టౌన్: దేవాదాయ ధర్మదాయ శాఖలో పనిచేస్తున్న చిల్లప్ప చంద్రశేఖర్‌కు ఇటీవల కార్య నిర్వహణ అధికారిగా పదోన్నతి లభించింది. టీఎన్‌జీఓస్, టీజీఓ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ అశోక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దేవాదాయ ధర్మదాయ శాఖలో ఉద్యోగులకు పదోన్నతులు కల్పించినందుకు మంత్రి కొండ సురేఖ, ప్రిన్సిపల్ సెక్రెటరి శైలజ అయ్యర్, కమిషనర్ హన్మంత్ రావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీఎన్‌జీఓస్ ప్రధాన కార్యదర్శి నవీన్ కుమార్, టీజీఓ సహాయ అధ్యక్షుడు శివకుమార్, రాజేందర్ దేశ్‌పాండే పాల్గొన్నారు.

బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో..

ఆదిలాబాద్: తెలంగాణ సంస్కృతిని బతుకమ్మ వేడుకలు ప్రతిబింబిస్తాయని ఆదిలాబాద్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సోలోమన్ అన్నారు. సోమవారం ఆదిలాబాద్ ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో బతుకమ్మ వేడుకలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బంది బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. అంటూ ఉత్సాహంగా ఆడిపాడారు. అనంతరం సోలోమన్ మాట్లాడుతూ బతుకమ్మ వేడుకలను ప్రజలంతా ఉత్సాహంగా జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ కల్పన, ఆర్టీసీ కండక్టర్లు విజయశ్రీ, తదితరులు ఉన్నారు.


బతుకమ్మ ఆడుతున్న ఆర్టీసీ సిబ్బంది

సంక్షిప్త వార్తలు

యువత అన్నిరంగాల్లో రాణించాలి

ఉట్నూర్‌రూరల్: యువత అన్నిరంగాల్లో రాణించాలని, కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉండాలని ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ అన్నారు. సోమవారం మండలంలోని దంతన్‌పల్లి గ్రామంలో ఫాస్ట్‌ఫుడ్ హోటల్‌ను ప్రారంభించారు. ప్రారంభోత్సవానికి వచ్చిన వారితో కలిసి అల్పాహారం చేశారు. నాణ్యమైన భోజనం, సేవలు అందించాలని, ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తూనే పలురంగాల్లో రాణించాలన్నారు.

బీటీ రోడ్డు పనులు ప్రారంభం

ఇచ్చోడ: మండల కేంద్రంలో ఆదిలాబాద్ బైపాస్ నుంచి నిర్మల్ బైపాస్ వరకు బీటీ రోడ్డు పనులు సోమవారం ప్రారంభమయ్యాయి. రెండు వరుసల రోడ్డుతో పాటుగా సెంట్రల్ లైటింగ్ డివైడర్ రోడ్డు పనులకు రూ. 16 కోట్ల నిధులు మంజూరు అయ్యాయి. గత కొన్ని రోజుల నుంచి గ్రావెల్, కంకర పనులు పూర్తి చేసి బీటీ రోడ్డు పనులను ప్రారంభించారు. రోడ్డు పనులు పదిరోజుల్లో పూర్తి చేయనున్నట్లు సంబంధిత సూపర్‌వైజర్లు తెలిపారు.

బెల్టుషాపులు బంద్ చేయించాలి

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ రూరల్ మండలంలోని పిప్పల్‌ధరి గ్రామంలో అక్రమంగా నిర్వహిస్తున్న తెల్లకల్లు, బెల్టుషాపు దుకాణాలను తొలగించాలని గ్రామ సార్‌మేడి జుగ్నాక్ సంభు, గీతాధర్ ప్రధాన కార్యదర్శి టేకం బలరాం కోరారు. సోమవారం ఆదివాసీ సంఘాల నాయకులతో కలిసి జిల్లా కలెక్టర్ రాజర్షి షాకు వినతిపత్రం అందజేశారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో కుమ్ర జంగు పటేల్, కొడప సోనేరావు, దౌలత్ రావు పాల్గొన్నారు.

బాలకేంద్రం చిన్నారులకు పురస్కారాలు

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని బాల కేంద్రానికి చెందిన చిన్నారులు ఆన్‌లైన్ వేదిక ద్వారా నిర్వహించిన నృత్య పోటీల్లో ప్రతిభ కనబరిచారు. రిఫ్లెక్షన్స్ గురు ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన శాస్త్రీయ నృత్య పోటీల్లో లయబద్ధంగా నర్తించి కళాశక్తి పురస్కారాలకు ఎంపికయ్యారు. పురస్కారాలకు ఎంపికైన వారిలో సమీక్ష, సన్నిధి, వామిక, సంజన, జాహ్నవి, ఇతీక్ష ఉన్నారని శిక్షకుడు, బాల కేంద్రం పర్యవేక్షకుడు మిట్టు రవి తెలిపారు.

ఐకేపీ కార్యాలయానికి చేరిన బతుకమ్మ చీరలు

నార్నూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ ఏడాది ఆడపడుచులకు కానుకగా అందించే బతుకమ్మ చీరలు సోమవారం మండల కేంద్రానికి చేరుకున్నాయి. ఐకేపీ కార్యాలయంలో ఏపీఎం మైసం రమేశ్ గ్రామాల వారీగా చీరలను సర్దుబాటు చేశారు. మండలానికి మొత్తం 12,960 బతుకమ్మ చీరలు వచ్చినట్లు తెలిపారు. ఏజెన్సీ మహిళలకు, ఎస్‌హెచ్‌జీ మహిళలుకు పంపిణీ చేయనున్నారు. వారి వెంట సీసీ శ్రీరాం, కార్యాలయ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

జయప్రదం చేయండి

ఎదులాపురం: సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని రామ్ లీలా మైదానంలో ఈనెల 10న బతుకమ్మ వేడుకలను నిర్వహిస్తున్నట్లు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సమితి జిల్లా అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రి పిలుపు నిచ్చారు. జిల్లా కేంద్రంలోని ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్‌లో పోస్టర్ విడుదల చేశారు. ప్రోత్సాహక బహుమతులను సైతం అందించనున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు గడం మాధవ్, సూర్యకాంత్, కందుల రవీందర్, రేణిగుంట రవీందర్, ప్రకాష్, సంజీవ్ పాల్గొన్నారు.

వేతనాలు విడుదల చేయాలి

ఆదిలాబాద్‌టౌన్: జూన్‌లో బదిలీ జరిగిన ఉపాధ్యాయులకు వేతనాలు ఇంత వరకు జమ కాలేదని, వెంటనే విడుదల చేయాలని టీయూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీకాంత్, జలందర్ రెడ్డిలు అన్నారు. సోమవారం ట్రెజరీ అధికారి హరికను కలిసి వినతిపత్రం అందజేశారు. అదేవిధంగా గత రెండు సంవత్సరాల కాలంగా పెండింగ్‌లో ఉన్న జెడ్పీజీపీ, టీఎస్‌జీఎల్‌యూ, సంపాధిత సెలవులు, మెడికల్ బిల్లు, రిటైర్మెంట్ ఉపాధ్యాయుల బిల్లులు వెంటనే మంజూరు చేయాలని కోరారు.


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు